విరిసిరిగా..!

పిచ్చాటూరులో పూలతో కళకళలాడుతున్న రోజా తోట



మొక్కలు.. మానవాళికి జీవం పోస్తాయన్న విషయం మనందరికీ తెలిసిందే. కానీ ఆ గ్రామాల కర్షకులకు జీవితం ఇస్తున్నాయి. ఆ ఊళ్లలో రైతులు దశాబ్దాలుగా పూల మొక్కల్నే నమ్ముకున్నారు. రకరకాల పూల సాగు చేసి, పొరుగునే ఉన్న తమిళనాడుకు తరలించి.. విక్రయించి, సిరుల పంట పండిస్తున్నారు సత్యవేడు నియోజకవర్గంలోని పలు పల్లెలకు చెందిన పుడమిపుత్రులు. పూలసాగుపై ప్రత్యేక కథనం.



రాచపాళెంలో బంతిపూల తోట

- పూల తోటల సాగుపై రైతుల మొగ్గు
- పెరుగుతున్న వాణిజ్య పంటలు
- రెండు దశాబ్దాలుగా సాగు
- చెన్నైకు ఎగుమతి

సత్యవేడు: నియోజకవర్గంలోని సత్యవేడు, పిచ్చాటూరు, కేవీబీపురం, నాగలాపురం మండలాల్లో రైతులు రోజా, మల్లి, చామంతి, సంపంగి, కనకాంబరం పూలతోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వరి సాగులో నష్టాల బారిన పడుతున్న రైతులు వాణిజ్య పంటలైన పూలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. మిట్ట ప్రాంతం, తక్కువ నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు పూలసాగు చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో కూలీలు దొరక్క వాణిజ్య పంటల సాగు చేపడుతున్నారు. పిచ్చాటూరు మండలంలోని పిచ్చాటూరు, రామగిరి, అప్పంబట్టు, అడవికండ్రిగ, కీళపూడి, శేషంపేట, అక్కగారిపేట, రెప్పలపట్టు, ఎస్ఎస్‌బీ, బంగాళ, మాలగుంట, శేరామపురంపేట, సత్యవేడు మండలంలో ఏఎం పురం, కన్నావరం, జడేడి, అల్లపుగుంట, రాచపాళెం, కాళమనాయుడుపేట, దళవాయి అగ్రహారం, రాజులకండ్రిగ, రాజుగుంట గ్రామాల్లో పూల సాగు చేస్తున్నారు. చిన్నకారు రైతులు అధికంగా ఎకరా, రెండెకరాలు కన్నా తక్కువ భూములు కలిగిన వారే పూలతోటలు సాగుపై దృష్టి సారిస్తున్నారు. రైతులు, కౌలు రైతులు ఇంటిల్లిపాది పూల మొక్కలు నాటిన మొదలు పంట కోత వరకు స్వయంగా తోట పనులు చేస్తున్నారు. పూల తోటల పెంపకంలో ఉద్యానవన అధికారులు అప్పుడప్పుడూ ఇస్తున్న సూచనలు సలహాలతో తెగుళ్ల బారి నుంచి పూల తోటలను కాపాడుకుంటూ తక్కువ ఖర్చుతో సాగు చేస్తున్నారు.

ఖర్చు తక్కువ.. రాబడి ఎక్కువ

రోజా సాగుకు దుక్కి మొదలు దిగుబడి వరకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు కాగా, మూడు టన్నుల పూల దిగుబడి వచ్చి, రూ.1.75 లక్షలు ఆదాయం చేకూరుతుంది. అలాగే సంపంగి సాగుకు ఎకరాకు రూ. 70 వేలు ఖర్చుకాగా, సుమారు పది టన్నుల పూల దిగుబడి వస్తుంది. తద్వారా రూ.1.75 లక్షలు రాబడి వస్తోంది. మల్లి సాగుకు ఎకరాకు రూ.60 వేలు ఖర్చు కాగా నాలుగు టన్నుల పూల దిగుబడి రాగా రూ.1.50 లక్షలు ఆదాయం చేకూరుతోంది. చామంతి సాగుకు ఎకరాకు రూ.80 వేలు ఖర్చుకాగా సుమారు నాలుగు టన్నుల దిగుబడి వచ్చి, రూ.1.40 లక్షల రాబడి వస్తుంది.

రాజమండ్రి నుంచి విత్తన మొక్కలు

పిచ్చాటూరు మండలంలో రోజాపూల సాగు చేస్తున్న రైతులు రోజా పూల విత్తన మొక్కలు రాజమండ్రి నుంచి తీసుకువస్తున్నారు. రాజమండ్రి మొక్కలతో అధిక దిగుబడి వస్తుందన్న నమ్మకంతో 20 ఏళ్లుగా ఆ మొక్కలనే నాటుతున్నామని రైతులు తెలిపారు.

తమిళనాడులో విక్రయం

తమిళనాడులోని చెన్నై నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాలకు సమీపంలోనే ఉండడంతో రైతులు తాము పండించిన పూలను వారే అద్దె వాహనాల్లో చెన్నైకు తరలించి, విక్రయిస్తున్నారు. పూలు నాణ్యంగా ఉండేందుకు సత్యవేడు ప్రాంతంలో రైతులు సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు పూలు కోస్తున్నారు. పిచ్చాటూరులో రాత్రి 11 వరకు పూలు కోసి చెన్నైకు సరఫరా చేస్తున్నారు.

12 వేల ఎకరాల్లో పూల సాగు

నాలుగు మండలాల పరిధిలో వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం సుమారు 12 వేలు ఎకరాల్లో రైతులు పలు రకాల పూలసాగు చేస్తున్నారు. రోజా, చామంతి, మల్లి, కనకాంబరం, సంపంగి పూల సాగు చేస్తున్న రైతులకు శాస్త్రీయ పద్ధతులపై ఉద్యాన వనశాఖ అధికారులు సూచలు, శిక్షణ సమావేశాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



రోజా తోటలో పూలు కోస్తున్న మహిళలు

అవగాహన కల్పించాలి



"రైతులకు శాస్త్రీ పద్ధతులు, యాజమాన్య పద్ధతులు స్వల్పంగా పాటిస్తున్నారు. వృద్ధులు సూచనల ఆధారంగా పూల సాగు చేస్తున్నాం. క్రిమి సంహారక మందులు షాపుల్లో దొరికేవి తెచ్చి పిచికారీ చేయడంతో పురుగుతోపాటు చెట్లు చనిపోతున్నాయి. నెలకోసారైనా ఉద్యానవన శాఖాధికారులు మా పూల తోటలను పరిశీలించి, సాగుపై మెళకువలు నేర్పాలి. – ఆర్ నటరాజన్, రైతు, రాచపాళెం

ఎరువులు సబ్సిడీ ఇవ్వాలి



పూల రైతులకు ప్రభుత్వం ఎరువులు సబ్సిడీలో అందించాలి. వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు బ్యాంకు రుణాలు అందజేసేందుకు సహకారం అందించాలి. మహిళా సంఘాల్లోని రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రుణ సదుపాయం కల్పించాలి. – ధనమ్మ, మహిళా రైతు, రాచపాళెం

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధలను పాటించాలని ఏఎస్ఐ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు బాలగురవయ్య తెలిపారు. వారు గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డులో ఆటోలు నిలిపిన ఆటోవాలాలకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహార ప్రదర్శనలో అంగన్ వాడీ కార్యకర్తలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు విధిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే శారీకంగా బలంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జమీల, సురేఖ, సుజాత, రేష్మ, సుభాషిణి, దిల్‌సాద్, ఏఎన్ఎంలు అంకమ్మ, ఝాన్సీ, సుమతి, శకుంతల, ఆశా వర్కర్లు విమల, మాలిని తదితరులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు జరిపారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

విరాళాల సేకరణ



విరాళాల సేకరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగలాపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నాగలాపురం దుకాణ యజమానుల నుంచి రూ.50,116 విరాళం సేకరించారు. ఈ నగదు ను సీఎం రిలీఫ్ ఫండ్‌గా పంపించామని కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ హరిబాబు, డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు ఢిల్లీ, లావణ్య, ఇందుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నవసంధి వినాయకులకు ముక్కంటి సారె రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నాలుగు మాడ వీధుల్లో ఉన్న నవసంధి వినాయకులకు శనివారం ముక్కంటి సారె సమర్పించనునట్లు ఆలయాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వినాయక చవితి సందర్భంగా ముక్కంటి ఆలయం తరపున నాలుగు మాడ వీధుల్లో ఉన్న వినాయక ఆలయాలకు సారె సమర్పించడం ఆనవాయితీ అన్నారు.

మహిళా కళాశాల వసతి గృహం తనిఖీ


అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి బేబీరాణి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళా డిగ్రీ హాస్టల్‌ను గురువారం శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని స్టోర్‌రూమ్, పరిసర ప్రాంతాలు, వంటశాలను పరిశీలించారు. అలాగే బాత్‌రూమ్‌లు రెండింటికే తలుపులు ఉండడం మిగిలిన వాటికి లేకపోవడం గమనించారు. మెను ప్రకారం భోజనం పెట్టడంలేదని గుర్తించారు. అనంతరం విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం కోర్టులో హాజరు కావాలని ఆదేశించారు.

సీపీఐ నిరసన



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. రాజీవ్‌నగర్‌లో వివాదాస్పదంగా మారుతున్న రీసర్వేపై సమగ్ర విచారణ జరిపి స్థానికంగా ఉన్న పేద, మధ్యతరగతి వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తులసీరాజన్, మోహన్‌రెడ్డి, మించల శివకుమార్, రొడ్డ గోపి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ప్రజానాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

టైలర్ కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో టైలర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చేజర్ల మల్లికార్జున దేవర అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు చాంద్‌బాషా, సుబ్రహ్మణ్యం, అశోక్, రాము, ప్రతాప్‌రెడ్డి, రమణయ్య, అబ్దుల్లా, కృష్ణ, సుబ్బరాయుడు, కోటి, సుధాకర్, రాజా, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద రాఖీ బిర్లా

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాఖీ బిర్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆమెకు ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేరాల నియంత్రణపై అవగాహన



శ్రీకాళహస్తి: పట్టణంలో గురువారం ట్రాఫిక్ నియమాలు, వన్‌వే, వన్‌సైడ్ పార్కింగ్, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, మాదక ద్రవ్యాల నిషేధం, వినాయకచవితి బలవంతపు వసూళ్ల తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు తదితరుల పాల్గొన్నారు.

భూములు బాగుంటేనే రైతులు సుభిక్షం



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

శ్రీకాళహస్తి: సాగు భూములు ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడులు వచ్చి రైతులు సుభిక్షంగా ఉంటారని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు గ్రామ రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగులో అధికంగా రసాయనాల వాడకంతో భూమి సారం కోల్పోతోందన్నారు. విరివిగా సేంద్రియ ఎరువులు వాడి, నేల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ వరి సాగులో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డివిజన్ ఉద్యానవన అధికారి పుష్పలత, ఉద్యాన సహాయకురాలు అహంతి తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

సత్యవేడు: వినాయక మండపాల్లో, నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి లేదని సీఐ తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో వినాయక చవితి నిర్వాహక కమిటీ సభ్యులు, పుర ప్రముఖులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుందామని పిలుపునిచ్చారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు అందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ ప్రత్యేక బృందాలతో సర్కిల్ పరిధిలోని సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో ప్రత్యేక బృందాలతో భద్రతా పరంగా పటిష్ఠ చర్యలు తీసుకొంటామన్నారు. వినాయక మండపాల ఏర్పాటు, నిర్వహణపై ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని, మండపాల నిర్వాహకులంతా ఆ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రచార ఆర్భాటం కోసం రోగుల కడుపుకోత

శ్రీకాళహస్తి: ప్రచార ఆర్భాటం కోసం ఆకలికేకలతో రోగులకు కడుపుకోత మిగల్చడం భావ్యం కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గత ప్రభుత్వం మధ్యాహ్నం వేళ రోగులకు ఆలయం నుంచి భోజనం పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్‌తో ఎలాంటి సంబంధం లేకపోయినా ఆ నెపంతో మార్చి నుంచి భోజన సరఫరాను నిలిపివేశారని ఆరోపించారు. తరువాత జూన్‌తో కొత్త ప్రభుత్వం ఏర్పడిందని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత వెంటనే ప్రారంభించాల్సి ఉన్నతాధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం భోజన సరఫరాను కొనసాగించాలని ఆస్పత్రి అధికారులను కోరగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, అలా జరిగిన ప్రతిసారీ మళ్లీమళ్లీ ప్రారంభిచాలంటే కుదరదన్నారు. అధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వాస్పత్రిలో భోజన సరఫరాను కొనసాగించాలన్నారు.

గిరి పుత్రులకు చేయూత



ఆధార్ కార్డు చూపుతున్న గిరిజన కాలనీ వాసులు

శ్రీకాళహస్తి రూరల్: గిరిపుత్రులకు ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్(పీఎంయూ) పూర్తిస్థాయిలో చేయూతనిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్ కుమార్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎర్రగుడిపాడు గిరిజన కాలనీలో గురువారం పీఎంయూ సిబ్బంది పర్యటించారు. కాలనిలోని 141 మంది గిరిజనులకు ఆధార్ నమోదు చేసి ఉచితంగా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎర్రగుడిపాడు గిరిజన కాలనీలో 55 కుటుంబాలున్నాయని చెప్పారు. వీరికి ఆధార్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, జాబ్ కార్డ్, రైస్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు, ఓటర్ గుర్తింపు కార్డులు లేవని తెలిపారు. ఫలితంగా వీరంతా ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన పీఎంయూ సిబ్బంది వీరిపై ప్రత్యేక దృష్టి సాధించి కొద్ది రోజులుగా ఆ కాలనీలో తిష్ఠ వేసి 141 మంది గిరిజనులకు ఆధార్ నమోదు చేసి, ఉచితంగా కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎస్వీయూలో పరిశోధకులకు ప్రత్యేక మెస్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పీహెచ్‌డీ, పీడీఎఫ్ పరిశోధక విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బి-మెస్‌ను వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పీజీ విద్యార్థులతో కలసి పరిశోధక విద్యార్థులు ఒకే మెస్‌లో భోజనం చేసేవారని చెప్పారు. ఈ నేపథ్యంలో వారి సౌకర్యార్థం కొత్త మెస్ ప్రారంభించామన్నారు. ఇందులో ఫార్మసీ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధకుల వార్డెన్ ఆచార్య బాలాజీ, గోపి నాయక్, నరసింహ, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురువులు..భవితకు శిల్పులు



నాగలాపురం: మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు



బుచ్చినాయుడుకండ్రిగలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నాగలాపురం: విద్యార్థుల్లో అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞాన కాంతులు నింపుతున్న గురువులే వారి భవితకు శిల్పులని డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని వ్యాపార సంఘం కళ్యాణ మండపంలో గురువారం ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్య, బుద్దులను నేర్పే జాతి నిర్మాతలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

గురువును సన్మానించిన ఎంపీడీఓ

వరదయ్యపాళెం మండల ఎంపీడీఓ పల్లమాలప్రసాద్ చిన్నతనంలో చదువు నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయురాలు జయశ్రీని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు.

గురువులే నవసమాజ నిర్మాతలు

సత్యవేడు: గురువులు నవ సమాజ నిర్మాతలని ఎంఈఓ రవి, ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. పుదుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందడంతో ఎంఈఓ, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశా రు. ఎంఈఓ 2 ఉషా పాల్గొన్నారు.

అన్నిదానాల్లో విద్యాదానం గొప్పది

శ్రీకాళహస్తి: అన్నిదానాల్లో విద్యాదానం గొప్పదని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం పలువురు ఉపాధ్యాయులను ఆయన తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

గురువుల స్థానం ఉన్నతమైనది

వరదయ్యపాళెం: ప్రాచీన కాలం నుంచి గురువుల స్థానం ఉన్నతమైనదని లోకా ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మీ దాసాజీ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వరదయ్యపాళెంలోని ఒన్నెస్ కోచింగ్ సెంటర్‌లో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం చేశారు. లోకా ఫౌండేషన్ విద్యా విభాగం ఇన్‌ఛార్జ్ హరి గోపాల్‌రెడ్డి, ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం రేణిగుంట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథ్ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. మండలంలోని 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన దేవసేనను సన్మానించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఏర్పేడు హైస్కూల్‌లో ఎంఈఓ ప్రేమలత, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ జీవీ ప్రభాకర్ రెడ్డి, బండారుపల్లి, పల్లం, పాపానాయుడుపేట హైస్కూల్‌లో గురు పూజోత్సవం నిర్వహించారు.

విలువ కట్టలేనిది గురుతర బాధ్యత

నారాయణవనం: విశ్వంలో విలువ కట్టలేనిది ఒక గురువు బాధ్యత మాత్రమే అని స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలో సేవలందించిన అధ్యాపకులను శాలువ కప్పి గౌరవించారు. ఈ వేడుకల్లో పుత్తూరు డిప్యూటీ విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.









రేణిగుంట: మాట్లాడుతున్న ఎంఈఓ ఇందిరాదేవి, శ్రీకాళహస్తి: టీచర్లను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు, వరదయ్యపాళెంలో.. సత్కారం, నారాయణవనంలో..